ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.



Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673




PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శుక్రవారం 27-03-2026 సంపుటి : 1 సంచిక :278 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-


# ఆయిల్ సంక్షోభంలో భారత్ !

"మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్థితులు రాబోతున్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి."





దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్నమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చున్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. పేజి 2లో ▶

# ఆపరేషన్ 'ఊర్జా సురక్షా'..

## చమురు నౌకలకు మన నేవీ భద్రత ఇలా..!



పశ్చిమాసియా యుద్ధ మేఘాలను దాటి కొన్ని చమురు, గ్యాస్ నౌకలు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. దేశీయ ఇంధన ప్రయోజనాలను కాపాడటంలో భాగంగా ఈ నౌకల భద్రత కోసం భారత నేవీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ ఊర్జా సురక్షా'ను ప్రారంభించి.. చమురు/ఎల్పీజీ నౌకలను సురక్షితంగా హర్మూజ్‌ను దాటిస్తోంది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను కొన్ని ఆంగ్ల పత్రికలు ప్రచురించాయి. పేజి 2లో ▶

## ట్యాంకర్లు సకాలంలో రాకపోవడంతోనే నో స్టాక్ బోర్డులు: మంత్రి ఉత్తమ్



- రాష్ట్రంలో రాబోయే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు.
- ట్యాంకర్లు సకాలంలో బంకులకు చేరుకోకపోవడం మరియు వదంతుల వల్ల ప్రజలు ఒక్కసారిగా ఎగబడటమే దీనికి ప్రధాన కారణం.
- గృహ అవసరాలకు, హాస్టళ్లకు, ఆసుపత్రులకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని, దీనిపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు.

2లో



# అమరావతికి చట్టబద్ధత కల్పించేలా ఏపీ క్యాబినెట్ తీర్మానం

క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు

- రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం
- వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చ
- ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ
- కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ
- జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు
- వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది.

కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. ఎల్లుండి అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

## ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండా ఎగరాలి



ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవం అన్నిచోట్లా పండుగలా చేయాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

## లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి జగన్ రగిలిపోతున్నారు: మంత్రి అనగాని



అమరావతి: ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్.. ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ (ూఅఖుస్త్రుఅఆ ాఫ్ఖు ్రాతీఖుఖుఙ) అన్నారు. స్టీల్ ప్లాంట్ వచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చేసిన కృషే ప్రధాన కారణమని చెప్పారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల క్రెడిట్ తనదేనని జగన్ అంటున్నారని మండిపడ్డారు. మొన్న గూగుల్ డేటా సెంటర్, నేడు మిత్తల్ స్టీల్ ప్లాంట్‌పై తనకు అలవాటైన అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి రగిలిపోతున్నారని చెప్పారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా లోకేశ్ స్టీల్ ప్లాంట్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్షన్నర మందికి ఉపాధి లభించనుందన్నారు. 2లో..

## ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం: మంత్రి నాదెండ్ల

- పట్టణ ప్రాంతాల్లో వినియోగదారులను సిలిండర్ల నుండి పైప్డ్ నేచురల్ గ్యాస్ వైపు మళ్లించేలా కొత్త పాలసీని తీసుకురాబోతున్నారు.
- బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం: సిలిండర్ల అక్రమ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు 800 కేసులు నమోదు చేసి, 3,540 సిలిండర్లను సీజ్ చేశారు.



## అరటి రైతులను ఆదుకోవాలి: వైఎస్ షర్మిలా రెడ్డి

- బనానా ప్రాసెసింగ్ యూనిట్ కేవలం ఎన్నికల స్టంట్
- వైసీపీ నేతల తీరుపై ధ్వజమెత్తిన ఏపీసీసీ చీఫ్
- రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా
- ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ఎందుకు నిద్రపోయారు
- ధర స్థిరీకరణ నిధితో కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి



## సిద్దిపేటలో రేవంత్‌రెడ్డే పోటీ చేయాలి..



# సంపాదకీయం

## భారత్ వ్యూహాత్మక స్వతంత్రత ఏమైనట్టు?!

పశ్చిమాసియాలో ప్రజ్వరిల్లుతోన్న యుద్ధం వల్ల, కరోనా సమయంలో తలెత్తిన సంక్షోభం లాంటిదే ఇప్పుడు దేశంలో నెలకొని ఉన్నదని, అందరూ కలిసికట్టుగా ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటించారు. ప్రస్తుతానికి గ్యాస్, చమురు కొరత లేదంటూనే, పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని ఆయన అనడం గమనార్హం. భారత్‌కే కాదు ప్రపంచానికే ఇంధన సంక్షోభం తలెత్తిందని ఆయన ప్రకటించారు. నిజానికి వంట గ్యాస్ విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడం ఇప్పటికే ప్రారంభమైందని ఆయనకు తెలియని విషయం కాదు. ఒక్కసారిగా దేశంలో ఇండక్షన్ స్టవ్‌లకు డిమాండ్ పెరగడంతో వాటి ధరలూ పెరిగాయి. ఆ స్టవ్‌లు కొనలేనివారు ఆకలితో పస్తులుండడమో, ఇతరులపై ఆధారపడడమో ఇప్పటికే ప్రారంభమైంది. 'మీ ఇంట్లో సీఎన్‌జీ ఉంది కదా.. నాలుగు రొట్టెలు చేసుకుని వెళతాను..' అని మా పనిమనిషి అడిగింది. బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్ల అమ్మకం కూడా జరుగుతోంది. 5 కేజీల సిలిండర్లలో గ్యాస్ నింపి ఇచ్చే దుకాణాలు మూతపడ్డాయి. తమకు రావాల్సిన సిలిండర్ల కోసం డీలర్లతో వినియోగదారులు గొడవలు పడుతున్న దృష్టాంతాలు కూడా ఎన్నో. ఇక రోడ్డు ప్రక్కన దుకాణాల్లో టీ, ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగిపోయాయి. చాలా పెట్రోలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. ప్రజలు పుకార్లను నమ్మి పెట్రోలు బంకుల ముందు బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో ఎలా ఉంటుందో తెలియదు కనుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజల ముందుకు వచ్చారు. కరోనా సమయంలో కొందరు ఆక్సిజన్‌ను బ్లాక్‌లో అమ్మిన అనుభవం ఉన్నందువల్ల.. బ్లాక్ మార్కెటింగ్‌ను సహించబోమని ఆయన హెచ్చరించారు. అయిదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ సమస్యలను ప్రజలు విస్మరించబోరని కూడా మోదీకి తెలియనిది కాదు. భారతదేశం దాదాపు 60శాతం ఎల్‌పీజీ దిగుమతి చేసుకుంటోంది. అందులో 90శాతం హోర్ముజ్ జలసంధి ద్వారానే రావాలి. తాజా వార్తల ప్రకారం, ఇప్పటికి అతి కష్టమ్మీద నాలుగు నౌకల్ని రప్పించుకోగలిగాం. గల్ఫ్ నుంచి పెద్ద సంఖ్యలో భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్టు పార్లమెంట్‌లో మోదీ చెప్పారు. వారు చేసే చెల్లింపుల వల్ల ఇక్కడి కుటుంబాలకు చేకూరే ప్రయోజనాలు ఇప్పుడు ఆగిపోయాయి. 'ప్రస్తుతానికి మీకు సమస్యలు ఏర్పడతాయని మాకు తెలుసు. కానీ దీర్ఘకాలంలో ప్రపంచంలో ఏ సమస్యా లేకుండా ఉండేందుకే ఈ యుద్ధం జరుగుతోంద'ని ఇటీవల ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ఢిల్లీలో చెప్పారు. ప్రపంచంలో అన్ని దేశాల తరఫున వకాల్తా పుచ్చుకుని యుద్ధం జరిపే అధికారం ఇజ్రాయెల్‌కు కానీ, ఆ దేశ గాడ్ ఫాదర్ అమెరికాకు కానీ ఎవరిచ్చారు?

నిజానికి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే పశ్చిమాసియా పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు గట్టిగా డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌లో ఈ అంశంపై చర్చ జరగాలని పట్టుబట్టడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. చర్చ జరపకుండా మోదీ పలాయనం చిత్తగించారని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణ చేశారు. చివరకు ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ప్రకటన చేసి పరిస్థితిని వివరించారు, కానీ పశ్చిమాసియా పరిస్థితిపై చర్చను ఇంతవరకు నిర్వహించలేదు. తాను ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్‌లతో మాట్లాడుతున్నానని, దౌత్యపరంగానే సమస్యను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశానని మోదీ తన ప్రసంగంలో చెప్పారు. కానీ, గతంలో ట్రంప్ తాను భారత్-- పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపానని చెప్పుకున్నట్లు ఇప్పుడు మోదీ చెప్పుకునే పరిస్థితిలో లేరు. అమెరికా, ఇజ్రాయెల్‌తో భారతదేశం మోదీ హయాంలో ఎంత గాఢానుబంధాన్ని పెనవేసుకున్నదంటే.. ఆ రెండు దేశాలను విమర్శించే పరిస్థితి లేకుండా పోయింది. ఇది రెంటికీ చెడ్డ రేవడిలా మారే ప్రమాదానికి దారితీస్తోంది. పార్లమెంట్ ఉభయ సభల్లో చేసిన సుదీర్ఘ ప్రసంగంలో అమెరికా, ఇజ్రాయెల్ వైఖరిని మోదీ ఏ మాత్రం విమర్శించకపోవడమే ఇందుకు నిదర్శనం. విశాఖపట్టణం తీరస్థ జలాల్లో భారత్ నిర్వహించిన నౌకా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న ఇరాన్ నౌకను హిందూ మహాసముద్రంలో అమెరికా పేల్చివేసినా భారతదేశం ఖండించలేదు. అదే సమయంలో ఇరాన్‌తో ఉన్న చరిత్రాత్మక సంబంధాన్ని కూడా భారత్ తెంచుకోలేని పరిస్థితిలో ఉన్నది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఆయన ఇప్పటికి రెండుసార్లు మాట్లాడి, జరిగిన దాడులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాకు అడ్డంకులు లేకుండా చూడాలని అభ్యర్థించారు.

నిజానికి 2003లో ఇదే విధంగా రసాయన ఆయుధాలు ఉన్నాయన్న నెపంతో ఇరాక్‌పై అమెరికా దాడులు జరిపినప్పుడు, నాడు అధికారంలో ఉన్న అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం తీవ్రంగా ఖండించడమే కాక పార్లమెంట్‌లో తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టింది. అధికార, ప్రతిపక్షాలు కలిసి ఏకగ్రీవంగా ఆ తీర్మానాన్ని ఆమోదించి అమెరికా వైఖరిని ఖండించేలా వాజపేయి చొరవ తీసుకున్నారు. స్పీకర్ మనోహర్ జోషి స్వయంగా ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ.. అమెరికా సంకీర్ణ దళాలు ఇరాక్‌పై చేసిన దాడులను తీవ్రంగా విమర్శించారు. ఇది చాలా అసాధారణమైన తీర్మానం అని ప్రకటించిన కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి అమెరికా ఎంత ప్రమాదకరంగా వ్యవహరిస్తోందో వివరించారు. అమెరికా విషపూరిత కుట్రల పర్యవసానాల పట్ల భారత్ అప్రమత్తంగా ఉండాలని కోరారు. బీజేపీ నేత విజయ్‌కుమార్ మల్హోత్రా, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత ఎర్రన్నాయుడు, సమాజ్‌వాది పార్టీ నేత ములాయంసింగ్ యాదవ్, సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీతో పాటు అన్ని పార్టీల నేతలు అమెరికా దౌర్జన్యాన్ని ఖండించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గొంతును ఎవరూ నొక్కలేరని, ఏ సవాల్‌నైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నాటి విదేశాంగ మంత్రి యశ్వంత్‌సిన్హా ప్రకటించారు.

వాజపేయి ప్రభుత్వ కాలం నాటికీ, మోదీ సర్కార్ హయాం నాటికీ వచ్చిన మార్పులు ఏమిటి? ఇప్పుడెందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలు పశ్చిమాసియాలో సంభవిస్తోన్న పరిణామాలపై నిర్దిష్టంగా వ్యాఖ్యానించలేకపోతున్నాయి? వెనెజువెలా, ఇరాన్‌లపై దాడులను ఎందుకు విస్మరించాయి?

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అమెరికాతో మన కంటే ఎక్కువగా అంటకాగిన పాకిస్థాన్ ఇప్పుడు ఇరాన్, అమెరికాల మధ్య సంధి కుదిర్చే విషయంలో కీలక పాత్ర పోషించడం. ఆదివారం పాక్ సైనిక దళాల ప్రధానాధికారి ఫీల్డ్ మార్షల్ మునీర్-- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోను, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సైతం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తోనూ మాట్లాడారని బ్రిటిష్ వార్తాపత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడించింది.

## సిద్దిపేటలో రేవంత్‌రెడ్డే పోటీ చేయాలి..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. సిద్దిపేటలో ఎవరో ఎందుకు.. రేవంత్‌రెడ్డే పోటీ చేయాలని డిమాండ్ చేశారు. పోటీకి ఆయన్ను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

"తలకిందులుగా తపస్సు చేసినా.. రేవంత్‌రెడ్డి మళ్లీ సీఎం కారు. ఎప్పుడు గోల్ కొట్టాలో మాకు బాగా తెలుసు. జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వస్తారో లేదో.. చెప్పడం కంటే చూస్తేనే బాగుంటుంది. నియోజకవర్గాల పునర్విభజనతో మా పార్టీకి మేలు జరుగుతుంది" అని హరీశ్‌రావు అన్నారు.

ఇటీవల సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలన్నారు. అక్కడ గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తానని చెప్పారు. ఈక్రమంలో తాజాగా హరీశ్‌రావు స్పందిచండం గమనార్హం.

## ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం: మంత్రి నాదెండ్ల

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులతో కొందరు ముందు జాగ్రత్తగా బుకింగ్‌లు చేస్తున్నారని చెప్పారు. పైప్డ్ గ్యాస్‌పై కొత్త పాలసీ తీసుకువచ్చేలా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. "వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచింది. రెస్టరంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణాల్లో ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో అమ్మకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. అక్రమాలపై 800 కేసులు నమోదు చేసి 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వన్ టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలని ఆదేశాలిచ్చాం. అర్హత లేని వారి చేతుల్లోకి సిలిండర్లు వెళ్లకుండా చూసుకునే బాధ్యత మాపై ఉంది. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. పట్టణాల్లోని వినియోగదారులను ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు" అని తెలిపారు.

## అరటి రైతులను ఆదుకోవాలి: వైఎస్ షర్మిలా రెడ్డి

మొదటి పేజీ తరువాయి

వైసీపీ జోలికి వెళ్లాల్సిన అవసరం తనకు లేదని, అయితే తన జోలికి వస్తే అఫెన్సివ్ గేమ్ ఆడగలనని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి హెచ్చరించారు. కడపలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన లక్ష్యం జగన్ మోహన్ రెడ్డి కాదని, కేవలం అరటి రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు. పులివెందులలో ఎన్నికల కోడ్ రావడానికి నెల ముందే బనానా ప్రాసెసింగ్ యూనిట్‌ను హడావిడిగా ప్రారంభించారని విమర్శించారు. అప్పట్లో ప్లాంట్‌లో బోర్ వెల్స్, ఆర్ఓ ప్లాంట్ వంటి కనీస వసతులు కూడా లేవని, కేవలం ఓట్ల కోసమే రిబ్బన్ కట్ చేశారని ఆరోపించారు. 2024 మార్చి 11న జగన్ ప్రారంభించిన ఈ ప్లాంట్‌లో ఇప్పటివరకు ఒక్క అరటి గెల కూడా స్టోరేజీ చేయలేదని ఆమె తెలిపారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రశ్నలు**

గత ప్రభుత్వం ఐదేళ్లు నిద్రపోయి, ఎన్నికలకు ముందు మాత్రమే నిద్రలేచిందని షర్మిలా రెడ్డి విమర్శించారు. సిద్ధం సభల పేరుతో తిరుగుతూ రిబ్బన్లు కట్ చేయడం తప్ప రైతులకు జరిగిన మేలు ఏమీ లేదని ఆరోపించారు. బనానా ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఎన్ని టన్నులు స్టోరేజీ చేశారో లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం పోరాటం చేస్తుంటే మద్దతు ఇవ్వాల్సింది పోయి, తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సరికాదని హితవు పలికారు. విజయమ్మ రాసిన లేఖపై వైసీపీ నేతలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, ఆ లేఖ సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని ఆమె వ్యాఖ్యానించారు.

**రైతులకు గిట్టుబాటు ధర**

రాయలసీమలో పండే నాణ్యమైన అరటికి గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం యుద్ధం కారణంగా ఎగుమతులు తగ్గి ధర పతనం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని షర్మిలా రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి వరకు టన్నుకు 26 వేల రూపాయలు ఉన్న ధర, ఇప్పుడు 4 వేలకు పడిపోవడం దారుణమన్నారు. కోల్డ్ స్టోరేజీలు లేక రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరటిని కొనుగోలు చేసి పాఠశాలలకు సరఫరా చేయాలని సూచించారు. ధర స్థిరీకరణ నిధిని పెంచి కూటమి ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి జగన్ రగిలిపోతున్నారు: మంత్రి అనగాని

మొదటి పేజీ తరువాయి

మాట తప్పి, మడమ తిప్పిన వ్యక్తి జగన్: మంత్రి గొట్టిపాటి

ఇచ్చిన హామీలపై మాట తప్పి, మడమ తిప్పిన వ్యక్తి జగన్ అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఇసుక దోపిడీతో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఆస్తులు కొల్లగొట్టడం, వ్యవస్థల నిర్వీర్యం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. మద్యనిషేధం హామీతో వచ్చి కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తల్లికి వందనం పథకాన్ని ఒక బిడ్డకే పరిమితం చేసి మోసం చేశారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం వచ్చాక గుండ్లకమ్మ ప్రాజెక్టును బాగు చేసిందని తెలిపారు.

## సీఆర్డీఏ-2014 తీర్మానం సవరణ.. 28న ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం

మొదటి పేజీ తరువాయి


దిల్లీ: అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ తీర్మానానికి రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. సీఆర్డీఏ-2014 తీర్మానాన్ని సవరించాలని ఏపీకి సూచించింది. ఈ సూచన మేరకు ఈ నెల 28న శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. ఈ తీర్మానాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలని గతంలో ఏపీ కోరిన విషయం తెలిసిందే.

### అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పునరావాస కుటుంబాలకు

## రూ.15 లక్షల చెక్కులు

మొదటి పేజీ తరువాయి




బచారం వద్ద ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనట్లు అటవీ శాఖ వెల్లడించింది. సుమారు 1,501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరిస్తే.. పులులు సహా వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించే పరిస్థితులు ఏర్పడతాయని అటవీ శాఖ తెలిపింది. విద్య, వైద్యం వంటి సదుపాయాలకు ఇన్నాళ్లు దూరమైన అడవి బిడ్డలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

గిరిజనుల జీవితాల్లో అభివృద్ధి నింపడంతో పాటు.. అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆధునిక పాఠశాలలు, అంగన్‌వాడీలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా వారి ఆర్థిక స్వావలంబనను బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

## ఆయిల్ సంక్షోభంలో భారత్ !

మొదటి పేజీ తరువాయి

దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించు కోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు. రేపు మరెలాంటి ముప్పు వస్తుందో చెప్పలేం. అందువల్ల భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగుల వేయాలి. ప్రజలను అందుకు సన్నద్ధం చేయాలి.

## ఆపరేషన్ 'ఊర్జా సురక్షా'..

మొదటి పేజీ తరువాయి

**హర్మూజ్ వద్దకు యుద్ధ నౌకలు..**

సాధారణంగా భారత్ వచ్చే చమురు/గ్యాస్ నౌకలు సౌదీ అరేబియాలోని రాస్ తనురా వంటి పోర్టుల నుంచి ప్రయాణం ప్రారంభిస్తాయి. ఇవి పర్షియన్ గల్ఫ్ మీదుగా హర్మూజ్ జలసంధి వద్దకు చేరుకుంటాయి. నౌక వేగం, ప్రయాణించే మార్గాన్ని బట్టి ఇందుకు గరిష్ఠంగా రెండు రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ జలసంధి వద్దే వందలాది నౌకలు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో వాటిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు భారత నౌకాదళం రంగంలోకి దిగింది. ఇరాన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు నౌకలు జలసంధి దాటేవరకు అనుక్షణం వాటికి సహాయసహకారాలు అందిస్తోంది. హర్మూజ్ దాటిన తర్వాత ఈ నౌకలు గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించి అక్కడినుంచి అరేబియా సముద్రంలోకి వస్తాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల వద్ద భారత నేవీ 5 యుద్ధ నౌకలను మోహరించింది.

ఈ యుద్ధ నౌకల సహకారంతోనే ఇటీవల రెండు గ్యాస్ ట్యాంకర్లు పైన్ గ్యాస్, జగ్ వసంత్ అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ దిశగా పయనిస్తున్నాయి. అంతకుముందు శివాలిక్, నందాదేవి వంటి గ్యాస్ నౌకలు కూడా ఈ ఆపరేషన్‌లో భాగంగానే దేశీయ పోర్టులకు చేరుకోగలిగాయి. ప్రస్తుతం ఇక్కడ భారత్‌కు రావాల్సిన 22 నౌకలు తరలింపునకు సిద్ధంగా ఉన్నాయి. వీటిల్లో 20 వరకు ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ, క్రూడ్ ఆయిల్ రవాణా చేస్తున్నవే..!

**సేఫ్ రూట్‌ను చెబుతూ..**

సాధారణంగా సముద్రంలో ప్రయాణం హైడ్రోగ్రాఫిక్ చార్టులు, నావిగేషన్ వ్యవస్థల ఆధారంగా ఉంటుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సీమైన్స్‌ను అమర్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిల్లో చాలావరకు బయటకు కన్పించవు. వీటి కారణంగా నౌకలకు తీవ్ర ముప్పు పొంచి ఉంటుంది. అందుకే, ఈ సీమైన్స్ తగలకుండా నౌకలను హర్మూజ్‌ను దాటించడం అత్యంత ఆవశ్యకం. దీన్ని గుర్తించిన భారత నేవీ.. మన నౌకల కోసం ప్రత్యేక హైడ్రోగ్రాఫిక్ చార్టులను రూపొందిస్తోంది. నిఘా నౌకలతో సముద్ర గర్భాన్ని స్కాన్ చేసి నావిగేషన్ రూట్స్‌ను గుర్తిస్తోంది. ఆయా మార్గాలను నౌకలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వాటిని హర్మూజ్ నుంచి తీసుకొస్తోంది.

**హర్మూజ్‌లో ఛార్జీలపై గందరగోళం..**

ఇదిలాఉండగా.. హర్మూజ్ జలసంధిని దాటే నౌకలకు ఛార్జీలు విధిస్తామని ఇరాన్ చెప్పినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అవన్నీ అవాస్తవమని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. అయితే, దీనిపై తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు గందరగోళం సృష్టిస్తున్నాయి. హర్మూజ్‌లో నౌకల సురక్షిత ప్రయాణానికి ఫీజులు వసూలు చేస్తామని ఓ మీడియా ఇంటర్వ్యూలో ఆయన చెప్పడం గమనార్హం. మరోవైపు, అమెరికా-ఇజ్రాయెల్ సంబంధిత నౌకలు మినహా మిగిలినవన్నీ హర్మూజ్ మీదుగా ప్రయాణించవచ్చని ఐరాస సమావేశంలో ఇరాన్ ప్రకటన చేసింది.

## ట్యాంకర్లు సకాలంలో రాకపోవడంతోనే నో స్టాక్ బోర్డులు: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మొద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి (ఖ్నుఎ ఎబఖ్మతీ తీవఎఎఎ) అన్నారు. ఆయిల్ కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడం వల్లే బంకుల్లో రద్దీ నెలకొందని తెలిపారు. క్యాన్లు, కంటెయినర్లలో ఇంధనాన్ని తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని చెప్పారు. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

"ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయి. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదు. వసతి గృహాలు, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా మానిటరింగ్ చేస్తున్నాం. హైదరాబాద్‌లో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పనిచేస్తున్నాయి. ఏ బంకునూ మూసివేయడానికి అనుమతించం. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నాం. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

వదంతులను నమ్మొద్దు: సజ్జనార్

హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని నగర కలెక్టర్ హరిచందన, సీపీ సజ్జనార్ తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా వార్తలపై నిఘా పెట్టామన్నారు.

# జిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయాలి

- ఫుడ్ ప్రాసెసింగు యూనిట్ల స్థాపనకు సంబంధిత అనుమతులు నిర్ణీత కాలంలో జారీ చెయ్యాలి
- సేంద్రియ విధానంలో సాగుచేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్ ఇమేజీతో పాటు మార్కెటింగు సౌకర్యం కల్పించాలి.
- జిల్లా సమగ్ర అభివృద్ధికి నూతన పెట్టుబడి దారులను ఆకర్షించేలా అధికారులు మనస్సు పెట్టి పనిచేసి లక్ష్యాలను అధిగమించాలి.
- జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష ...



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జ్ బి ప్రభాకర్

జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో గురువారం జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (ఐ×జుూజ) సమావేశంలో సంబంధిత శాఖలు అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా. యం.జె.అభిషేక్ గౌడ, సంబంధిత శాఖలు అధికారులతో కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి జిల్లాలో పరిశ్రమలు ప్రగతిని,గత మాసంలో జరిగిన జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలుపై జరిగిన ప్రగతిని, పెండింగ్లో ఉన్నవి, భవిషత్తు కార్యాచరణను మండలాలు, శాఖలు వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో కోకో సిటీని పెదవేగి మండలం రామసింగవరంలో ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందన్నారు. 173 ఎకరాల్లో క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని సూచించారు. జిల్లా గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగు యూనిట్లు మరింత ఎక్కువగా స్థాపించుటకు ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. గిరిజన తండాల్లో యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెంచి గిరిజన కుటుంబాలకు ఆర్థికంగా బలోపేతం చెయ్యాలని అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగు యూనిట్లు లక్ష్యం 168 కాగా వివిధ , 85 ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలినవి ఈ నెల చివరినాటికి పూర్తి చెయ్యాలని సూచించారు. ఆయా బ్యాంకులకు స్వయంగా వెళ్ళి సంప్రదించి రుణాలు మంజూరు చేయించాలని అన్నారు. చింతలపూడి నియోజవర్గంలోని ఇండస్ట్రియల్ పార్కులో రోడ్డులు, డ్రైనేజీలు పూర్తయ్యాయని మిగతా పనులు వారం రోజుల్లో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఏలూరు నియోజకవర్గంలో భూసేకరణ పూర్తి చేసి, వారం రోజులు లోపుగా పనులు మొదలు పెట్టాలని సూచించారు. పోలవరం నియోజకవర్గంలో భూమి లెవెలింగు పనులు పూర్తి చెయ్యాలని, దెందులూరు నియోజకవర్గంలో భూములు ఇచ్చిన రైతులకు భూమి పరిహారం మంజూరుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉంగుటూరు నియోజక వర్గంలో భూములు ఇచ్చిన రైతులకు భూమి పరిహారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నూజివీడు నియోజకవర్గంలో డిపట్టాదారులతో జిల్లా జాయింటు కలెక్టరు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, భూ పరిహారాన్ని నిర్ణయించాలని అన్నారు. కైకలూరు నియోజక వర్గంలో పశువర్ధక శాఖ నుండి క్లియరెన్స్ కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగిందని, మంజూరు ఉత్తర్వులు రాగానే ఏపిఐఐసి అప్పగించాలని సూచించారు.సింగిల్ విండో పథకం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, అవసరాన్ని బట్టి ఒక్క రోజులోనే అనుమతులు మంజూరు చేసి ప్రతి యూనిట్ ను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఋణాలు మంజూరులో ప్రత్యేక దృష్టి సారించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న రుణాలను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగు యూనిట్లు, టూరిజం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆక్వా రంగాలలో నూతన వరవడులు గుర్తించి ప్రైవేటు పెట్టుబడులు దారులను మరింత ఆకర్షించేలా జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రైవేటు పెట్టుబడిదారులను ఆహ్వానించి ప్రభుత్వం నుండి వారికి కావలసిన సౌకర్యాలు, సహాయం అందించడం కోసం వారితో సమావేశాలు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేసి, మంచి ప్రగతిని సాధించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలు కేంద్ర జియం ఆర్.వెంకటరావు, జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, ఏపి ఐఐసి జోనల్ మేనేజరు కె.బాబ్జీ, గ్రౌండు వాటరు డిడి పైలా కోదండరామ్, ఏపి యంఐపి పిడి డా.యస్. రామ్మోహన్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.షాజానాయక్, జిల్లా అగ్నిమాపకదళ అధికారి సి.హెచ్. రత్నబాబు, జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి యస్. బి.శేఖరు, జిల్లా మత్స్య శాఖ డిడి బి.రాజ్ కుమార్, జిల్లా పరిశ్రమలు తనిఖీ అధికారి కె.కృష్ణమూర్తి, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, జిల్లా పంచాయతీశాఖ అధికారి కె.అనురాధ, జిల్లా స్కిల్ డెవలప్మెంటు అధికారి యన్.జితేంద్రబాబు, సెట్ వేల్ సిఇవో కె.యస్.ప్రభాకర రావు, యల్డియం డి.నీలాద్రి, సంబంధిత శాఖలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వార్షిక సమీక్ష సమావేశం

గాయత్రి వార్తలు





మండల కేంద్రంలోని చంద్రశేఖరపురం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం చంద్రశేఖరపురం మండల ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేష్ ఆధ్వర్యంలో చంద్రశేఖరపురం, పామూరు మండలాల పశు సంవర్ధక సహాయకులతో ఫైనాన్షియల్ సంవత్సర ముగింపు సందర్భంగా సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రెండు మండలాల పశు వైద్యాధికారులు డాక్టర్ షేక్ మునీర్, ఆర్. హనుమాన్ సాహెబ్ అధ్యక్షతన ఈ సంవత్సరం పశుసంవర్ధక శాఖ చేపట్టిన పలు కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.సమీక్షలో భాగంగా పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నియంత్రణ, గాలికుంటు వ్యాధి టీకాల నిర్వహణ, గ్రామస్థాయిలో పశు సేవల అందుబాటు, పశుపోషకులకు ఇచ్చిన సూచనలు, అవగాహన కార్యక్రమాల ఫలితాలు వంటి అంశాలను విశ్లేషించారు. గ్రామాలలో పశు సంవర్ధక సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమని, సకాలంలో టీకాలు, వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాల ద్వారా పశుపోషకుల ఆదాయం పెరిగే విధంగా శాఖ మరింత కృషి చేయాలని సూచించారు సమీక్ష సమావేశం నకు రెండు మండలాల పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు

# శీలంవారిపల్లి లో శ్రీరామనవమి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

గాయత్రి వార్తలు



మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో పుణ్యక్షేత్రమైన కోదండ రామస్వామి దేవస్థానం నందు మేళ తాళాలతో వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో శ్రీరామనవమి వార్షికోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వార్షిక కళ్యాణ మహోత్సవాల ఆరంభ వేళ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, గంటానాదాలు, ధూపదీపాల నైవేద్యాలతో స్వామివార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, కలశ ప్రతిష్టతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, నవగ్రహ పూజలు విశిష్టంగా నిర్వహించారు. అంకురార్పణ పూజలతో ఈ మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి అనంతరం జరిగిన సుప్రభాత సేవ నాదస్వర కచేరి నిర్వహించారు ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని , ఈ వార్షికోత్సవ వేడుకలకు భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# వంట గ్యాస్, పెట్రోల్ కు ఎటువంటి కొరతా లేదు..
# ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దు

- ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి
- వంట గ్యాస్ సరఫరాపై గట్టి నిఘా పెట్టాలి బ్లాక్ మార్కెట్ కు తరలించే వారిపై కేసులు నమోదు చేయండి
- పీఎన్ జి గ్యాస్ వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కలిగించాలి
- నిత్యాన్నదానం నిర్వహించే దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు పి ఎన్ జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో గ్యాస్, పెట్రోల్ సరఫరాపై అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్ కు ఎటువంటి కొరతా లేదని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం జిల్లాలో గ్యాస్, పెట్రోల్ సరఫరాపై అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరతా లేదని, ప్రజల భవిష్యత్తు అవసరాలకు కూడా సరిపడా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో గృహ వినియోగదారులకు సంబంధించి వంట గ్యాస్ రోజుకు సగటున 10 వేల వరకు బుకింగ్స్ నమోదవుతున్నాయని, వాటికి నిర్ణయించిన సమయంలోగా అందిస్తున్నామన్నారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నవారికి ఎక్కువ రోజులు వేచిఉండకుండా నిర్ణీత సమయంలోగా గ్యాస్ సరఫరా చేసేలా గ్యాస్ ఏజెన్సీస్ చర్యలు తీసుకోవాలన్నారు. పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ చాలా తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవచ్చని, జిల్లాలో పైపు లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ సరఫరా పై ప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించి గృహ, వాణిజ్య అవసరాలకు పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ల ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిత్యాన్నదానం నిర్వహించే దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని, పి .ఎన్ .జి. గ్యాస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది దురుద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియా ద్వారా గ్యాస్, పెట్రోల్ కొరత ఉందని వదంతులను వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని, అవసరానికి మించి గ్యాస్, ఆయిల్ కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజీల్ కొరత ఉన్నదంటూ వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుత సమయంలో గృహ వినియోగ గ్యాస్ వాణిజ్య అవసరాలకు మరలకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని, బ్లాక్ మార్కెట్ చేసే ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఆందోళనకు గురికావద్దని ప్రజలకు అధికారులు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి. విలియమ్స్, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, ఇండియన్ ఆయిల్, భారత్ , హిందూస్తాన్ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు మహేష్, సందీప్, సూర్య, గ్యాస్ ఏజెన్సీస్ అసోసియేషన్ ప్రతినిధి బ్రహ్మానందం, పెట్రోల్ బంక్ యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధి స్వర్ణ శేఖర్, పి ఎన్ జి ఏజెన్సీలకు సంబంధించి గోదావరి గ్యాస్ పైప్ లైన్ , మేఘా గ్యాస్ పైప్ లైన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# బస్సు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు సజీవ దహనం

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మితికాల గురవయ్య

గాయత్రి వార్తలు



జిల్లా పరిధిలోని రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై వైయస్సార్ టియుసి జిల్లా అధ్యక్షులు మితికాల గురవయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్–ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని,ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే కదిరి

గాయత్రి వార్తలు



జిల్లా లోని రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్–ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధితు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని,ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని,ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జ్ బి ప్రభాకర్

ఏలూరు లోని పవర్ పేట లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) వైద్య పరీక్షలు చేయించుకున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సహాయంతో పాటు తన వంతుగా చేయూతను అందించాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఏలూరు ఆశ్రమ ఆస్పత్రి వైద్యులు ఈ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను కూడా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, డివిజన్ ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 1 న ప్రారంభం కానున్న నల్లమల్ల అమర్నాథ్ (సలేశ్వరం) యాత్ర

**అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చెంచు యువత పిలుపునిచ్చారు**

గాయత్రి వార్తలు



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో నల్లమల్ల అమర్నాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం లింగమయ్య స్వామి జాతర ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. దట్టమైన నల్లమల అడవిలో కొండలు, గుట్టలు దాటుతూ సాగే సలేశ్వరం జాతర ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 3 వరకు జరగనుంది. ఈ క్షేత్రం ఏడాది పొడవునా తెరిచి ఉండదు. కేవలం ఉగాది తర్వాత తొలి పౌర్ణమికి ప్రారంభమై నాలుగు నుంచి ఐదు రోజుల్లో ముగుస్తుంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మన్ననూరు దాటిన తర్వాత అడవి గుండా లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. సలేశ్వరం రామలింగేశ్వర స్వామి జాతరకు సంబంధించిన ఏర్పాట్లు అధికార యంత్రాంగం ముమ్మరంగా చేపట్టింది. స్వామివారి జాతర ఏర్పాట్లలో స్థానిక చెంచు యువత చురుగ్గా పాల్గొని సహకరించాలని కోరారు. సలేశ్వరం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకోవాలని చెంచు యువత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగమయ్య స్వామి జాతర నిర్వాహక కమిటీ సభ్యులు, చెంచు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పునర్వినియోగ సానిటరీ ప్యాడ్స్ పంపిణీ

గాయత్రి వార్తలు





రోటరీ క్లబ్ మరియు ఎస్ బి ఐ ల సంయుక్త ఆధ్వర్యంలో పునర్వినియోగ సానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం ఆర్మూర్ జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనే లహరి రఘు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండలం లోని 15 పాఠశాల నుండి 1049 మంది విద్యార్థినులకు ఒక సంవత్సరం పాటు వినియోగించే పునర్వినియోగ సానిటరీ ప్యాడ్స్ ప్యాకెట్స్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సైన్స్ టీచర్లకు గోనే లాహరీ మరియు రోటరీ ప్రతినిధుల చేతులమీదుగా అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే సానిటరీ ప్యాడ్స్ పంపిణీ అనేది ఎంతో విలువైనది అని మరియు వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణకు గాను రోటరీ సభ్యులకు గొనె లహరి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ నూకల విజయసారథి,ప్రాజెక్ట్ చైర్మన్ గా కాంతి గంగారెడ్డి, చరణ్ రెడ్డి,పుష్పకర్ రావు, రోటరీ ఎలక్ట్ ప్రెసిడెంట్ వన్నెల్ దేవి రాము, సెక్రటరీ ఖాందేశ్ సత్యం,రాస ఆనంద్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య,వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన : కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు

గాయత్రి వార్తలు







జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణంలోని రామాలయం లో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకులు జువ్వాడి నర్సింగరావు ను స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు ఈ కార్యక్రమంలో జువ్వాడి తో పాటు మున్సిపల్ వైస్ చేర్మెన్.కౌన్సిలర్ లు మరియు కాంగ్రెస్ పార్టీ లో వివిధ హోదాలో నాయకులు కార్యకర్తలు హనుమాన్ మాల ధారణ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట రాములోరి కళ్యాణానికి ముస్తాబైన రామాలయం...

గాయత్రి వార్తలు



కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం గా వెలిసిన శ్రీ సీతారాముల స్వామి 700 సంవత్సరాల క్రితం రాతితో నిర్మించబడిన రామాలయం, కాకతీయుల నాటి నిర్మించబడిన దేవాలయం, 700 సంవత్సరాల నుండి వెలుగుతూనే ఉన్న అఖండ దీపం ఆ ఊరు ప్రత్యేకత, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని శ్రీ సీతారాముల స్వామి దేవాలయం, సీతారాముల కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది, బ్రహ్మోత్సవాలు భాగంగా రేపు జరగబోయే సీతారాముల కళ్యాణానికి అన్ని సౌకర్యాలతో సీతారాములస్వామి దేవాలయం ఆలయ చైర్మన్ మల్లు గారి నర్సా గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు,

# బస్సు ప్రమాదంలో అంకభూపాలపురం మహిళ మృతి

**– సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

గాయత్రి వార్తలు



మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. ఆమెను బండారు పద్మ (25)గా గుర్తించారు.అంక భూపాలపురం గ్రామానికి చెందిన బండారు పద్మ, బత్తుల మణెమ్మ సహా పలు కుటుంబాలు తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా నిర్మల్ సమీపంలో స్థిరపడ్డారు. వీరంతా అక్కడ బేల్దారి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో బండారు పద్మ, బత్తుల మణెమ్మ, 10 సంవత్సరాల వయసున్న బండారు రోహన్ లు సొంతూరు వెళ్లేందుకు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కనిగిరికి బస్సులో బయలుదేరారు. బస్సు ప్రమాదానికి గురై మంటలు చెలరేగాక బత్తుల మణెమ్మ వెంటనే స్పందించి, పక్కనే కూర్చున్న రోహన్ ను కిటికీలోనుంచి బయటకు విసిరేసింది. తరువాత మణెమ్మ కూడా ప్రమాదం నుంచి తప్పించుకుని బయటపడింది. కానీ బండారు పద్మ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైంది. కాగా పద్మకు భర్త గోవిందరాజులు, 12 సంవత్సరాల వయసున్న కుమారుడు, పది సంవత్సరాల వయసున్న కుమార్తె ఉన్నారు. రోహన్ తల, చెవులు, ముక్కు, కాలుకు స్వల్ప గాయాలయ్యాయి. మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బత్తుల మణెమ్మ కుడి చెయ్యి విరగడంతో పాటు కిడ్నీకి తీవ్ర గాయం అయింది. ఆపరేషన్ కోసం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే వారి బంధువులందరూ మార్కాపురం చేరుకున్నారు. అలాగే గుడ్లూరు మండలం వెంకంపేట గ్రామానికి చెందిన తుపాకుల రత్తమ్మ (భర్త పోలయ్య) కూడా దుత్తలూరు వెళ్లేందుకు ఇదే బస్సులో బయలుదేరింది. అయితే ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. కాగా బత్తుల పద్మ అకాల మరణం పట్ల, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. పద్మ భర్త గోవిందరాజులతో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. అలాగే రోహన్ తల్లిదండ్రులు, మణెమ్మ, రత్తమ్మ కుటుంబ సభ్యులతో కూడా ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురి ఆరోగ్యం మెరుగుపడి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేవరకు, ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు.

# శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గాయత్రి వార్తలు



శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని స్మరించుకుంటూ జరుపుకునే శ్రీరామనవమి పండుగ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు.ధర్మం, న్యాయం, అంకితభావంతో పనిచేసే నాయకత్వం ఇవన్నీ శ్రీరాముని జీవితం మనకు నేర్పిన గొప్ప సందేశాలు ప్రతి ఒక్కరి జీవితంలో ధర్మం నిలవాలి. ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి – ఇదే మన సంకల్పం కావాలి. శ్రీరాముని ఆదర్శాలు మనకు మార్గదర్శకం కావాలి. సీతా సమేత కోదండరాముడి కరుణా కటాక్షాలు మీ అందరిపై ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# నియోజకవర్గ ప్రజలకు సీతా సమేత శ్రీరామనవమి శుభాకాంక్షలు

**– నియోజకవర్గ వైయస్సార్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్**



గాయత్రి వార్తలు

ఆదర్శ పురుషుడు ఏకపత్నీవతుడు శ్రీరాముని జన్మదినం సందర్భంగా కందుకూరు నియోజకవర్గం ప్రజలందరికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ గారు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సందర్భంగా సీతా సమేత, లక్ష్మణ, హనుమంతు, శ్రీరాముని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ నిండుగా మెండుగా కలగాలని ఆకాంక్షించారు. భక్తులందరూ సుఖ సంతోషాల మధ్య శ్రీరామనవమి వసంతోత్సవాలను జరుపుకోవాలని సీత శ్రీరామ కళ్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి ఆనంద పరవశం లో భోగభాగ్యాలతో తులతూగాలని శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కదిరి

గాయత్రి వార్తలు

శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని సీతారాముల దివ్య కల్యాణాన్ని స్మరించుకుంటూ జరుపుకునే వేడుకలకు కనిగిరి మాజీ శాసనసభ్యులు వైయస్సార్సీపి విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మం, న్యాయం, అంకితభావంతో శ్రీరాముని జీవితం మనకు నేర్పిన గొప్ప సందేశాలని, శ్రీరామచంద్రమూర్తిని ఆదర్శంగా తీసుకుని పండుగను ఘనంగా జరుపుకోవాలని, ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి – ఇదే మన సంకల్పం కావాలి. శ్రీరాముని ఆదర్శాలు మనకు మార్గదర్శకం కావాలి. సీతా సమేత కోదండరాముడి కరుణా కటాక్షాలు మీ అందరిపై ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# విశ్వబ్రాహ్మణులు రాజకీయలలో రాణించాలి

**– వడ్లమాని నారాయణ చారి**

గాయత్రి వార్తలు



దేశంలో ఎంతో ఘన చరిత్ర కలిగిన విశ్వ బ్రాహ్మణులు రాజకీయాల్లో కూడా రాణించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారి అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత ఘనమైన చరిత్ర, ఘనమైన వేదవైదిక సంప్రదాయాన్ని కొనసాగిస్తూ విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లోనే కాకుండా రాజకీయ రంగంలోనూ దృఢమైన పట్టు సంపాదించాల్సిన అవసరం ఉందని అన్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం వ్యవస్థాపకులు, అభినవ విద్యారణ్య బిరుదాంకితులు యర్రోజు మాధవాచార్యుల విగ్రహాన్ని అమరావతిలో ప్రతిష్ఠించేందుకు విశ్వబ్రాహ్మణ సమాజం భారీ స్థాయిలో సిద్ధమవుతోందని వెల్లడించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన విశ్వబ్రాహ్మణుల ఆధ్యాత్మిక వారసత్వానికి వెలుగునిస్తున్న చారిత్రక కార్యక్రమమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా కమ్మరి పార్వతమ్మ నియామకం సమాజానికి వచ్చిన గౌరవప్రదమైన గుర్తింపని అన్నారు. సంఖ్యా బలం లేదా ఆర్థిక బలం లేకపోయినా విశ్వబ్రాహ్మణులు రాజకీయాల్లో ఎదగగలరని ఈ నియామకం మరోసారి చాటిచెప్పిందన్నారు. కమ్మరి పార్వతమ్మ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు రాష్ట్రవ్యాప్తంగా విశ్వబ్రాహ్మణులు ఏకీకృతంగా సమిష్టిగా కలిసి వెళితే రాజకీయ ప్రాధాన్యత మరింత పెరుగుతుందని అన్నారు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు రాజకీయాల్లో ప్రాధాన్యత పెరిగేటట్లు కమ్మరి పార్వతమ్మకు అండగా నిలవాలని, ప్రభుత్వంలో విశ్వబ్రాహ్మణుల రాజకీయ ప్రాతినిథ్యం పెరుగుతుందని అన్నారు విశ్వబ్రాహ్మణ సమాజం రాజకీయపరంగా ముందుకు రావడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేయగలమని పేర్కొన్నారు ఎప్పుడు విశ్వబ్రాహ్మణులకు సమస్యలు వచ్చిన అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు తన కృషి చేస్తానని అన్నారు

# గుడ్లూరులో దాతల సహకారంతో చల్లని మజ్జిగ పంపిణీ




గాయత్రి వార్తలు

గుడ్లూరు మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నేత్రపురి శ్రీరామసేవక్ ఆధ్వర్యంలో కందుకూరు వాస్తవ్యులు గుర్రం లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మహేష్ కుమార్, సుమన్ కుమార్ మరియు వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఉదయం 11. 00 గంటలకు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని నేత్రపురి శ్రీరామసేవక్ కార్యనిర్వాహకులలో ఒకరైన ఇన్నమూరి. సుధాకర్ బస్టాండ్ సెంటర్లో ఉన్న ప్రయాణికులకు చల్లని మజ్జిగను వారి చేతుల మీదుగా అందించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులలో మరొక రైనటువంటి ఎయిర్టెల్ చిన్న మాట్లాడుతూ గత సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా ఈ చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మరియు మంచినీటి చలివేంద్ర కేంద్రాన్ని మొన్నటి ఉగాది పండుగ రోజు నుంచి ప్రారంభించామని గుడ్లురుకు చెందిన యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్ట్ మరియు నేత్రపురి శ్రీరామసేవక్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు మంచినీటి చలివేంద్రము మరియు వారానికి మూడు నుండి నాలుగు రోజులపాటు ఈ చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి దాతలు అందరూ సహకరించలని కోరారు. వేసవికాలంలో జలదానం అంటే మంచినీరు,మజ్జిగ,శీతల పానీయాలు ఇలాంటి వాటిని దానాశీ చేసి కొందరి దాహార్తి నైనా తీర్చటం ఎంతో పుణ్య కార్యక్రమమని మన పురాణాలు చెబుతున్నాయని తెలియజేశారు.సోషల్ మీడియాలో మేం పెట్టే పోస్టులను చూసి మంచి మనసుతో స్పందించి కందుకూరుకు చెందిన మా మిత్రుడు మహేష్ ఈరోజు వారి తల్లి గారి జ్ఞాపకార్థం ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించారు వారికి,వారి కుటుంబ సభ్యులకు మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల బిజెపి మాజీ అధ్యక్షుడు, నేత్రపురి శ్రీరామ సేవక్ కార్యనిర్వాహకులు ఇన్నమరి ప్రమీల సుధాకర్, ఆర్యవైశ్య సంఘశీ ఉపఅధ్యక్షుడు ఎయిర్టెల్ చిన్న, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరా మాల్యాద్రి,,ప్రధాన కార్యదర్శి ఇన్నమూరి గరటయ్య, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసులు,గుడ్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు సన్నిశెట్టి గిరిబాబు, పాజర్ల బ్రహ్మయ్య, మీడియా మిత్రులు జవంగుల సుధాకర్, సి. హెచ్.ఆంజనేయులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కదిరి

గాయత్రి వార్తలు

మార్కాపురం జిల్లా రాయవరం వద్ద ప్రమాదానికి గురైన బస్సును కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పరిశీలించి ప్రమాధానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.అక్కడ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు .జీవనోపాధి కోసం తెలంగాణ ప్రాంతానికి వెళ్లి బస్సు ప్రమాదంలో చనిపోవడం బాధాకరం అన్నారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.